సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



ఆధార్ తరహాలో అపార్

విద్యార్థుల కోసం 12 అంకెలతో కేంద్రం స్టూడెంట్ ఐడీ జారీకి సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి పశ్చిమలో 1.12 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. 10లో



కొబ్బరి ధరహాసం

కొబ్బరిధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వెయ్యి కాయలు మొన్నటి వరకూ రూ.10 వేలు ఉండగా.. ఇప్పుడు రూ.13 వేలకు చేరింది. 10లో



చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్ట్

చోరీ కేసుల్లో ముగ్గురిని జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3.50 లక్షల విలువైన బంగారం, వెండి, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. 10లో

మినీ గోకులాలపైనా కూటమి కన్ను

- నియోజకవర్గాలకు మంజూరైన షెడ్ల పంపకాల్లో తేలని పంచాయతీలు
- అయిన వారికి కట్టబెట్టేందుకు అర్హులకు మొండిచేయి
- ఎమ్మెల్యేల సిఫార్సులకు పచ్చజెండా
- జిల్లాకు 854 షెడ్ల మంజూరు
- ఇంతవరకు రూ.10.71 కోట్ల విలువైన 630 షెడ్ల మంజూరు





సాక్షి, భీమవరం : పాడిరైతుల కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరుచేస్తున్న మినీ గోకులాల షెడ్లపై కూటమి నేతల కన్ను పడింది. తమకు కావాల్సిన వారికి కట్టబెట్టుకునేందుకు నియోజకవర్గాలకు మంజూరైన యూనిట్లలో మీకిన్ని.. మీకిన్ని అంటూ వాటాలు పంచుకుంటున్నారు. కొన్ని చోట్ల పంపకాల పంచాయతీలు తేలక నాయకుల మధ్య విభేదాలు చోటుచేసుకుంటున్నాయి.

దాణా ఖర్చులు పెరిగిపోవడం, పాల ధర లాభసాటిగా లేకపోవడం తదితర కారణాలతో రైతుల్లో పశుపోషణ పట్ల ఆసక్తి తగ్గింది. దీంతో వారు అదనపు ఆదాయం ఆర్జించేలా మినీ గోకులాలు పేరిట కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పశువుల షెడ్లు మంజూరు చేస్తోంది. పశువుల షెడ్లు, నీటితొట్టి ఇతర సదుపాయాలు కల్పించుకుని రెండు పాడిపశువుల నుంచి ఆరు వరకు పోషణ సాగించేందుకు వీలుగా రూ. 1.15 లక్షల నుంచి రూ.2.30 లక్షల వరకు సాయం అందిస్తోంది. ఈ మొత్తంలో పదిశాతం రైతు వాటా కాగా మిగిలిన మొత్తం సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందజేస్తోంది. ఈ షెడ్లు పొందేందుకు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, వలస రైతులు అర్హులు. మహిళా రైతులు, అంగవైకల్యం ఉన్న యజమాని కుటుంబాలు, చిన్న, సన్నకారు రైతులు ఈ పథకం కింద షెడ్లు నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన పాడి రైతులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, జాబ్ కార్డు, స్థలం హక్కుపత్రం, బ్యాంక్ పాస్‌బుక్ జత చేయాలి. గతంలో పశుసంవర్ధకశాఖ అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేయగా ప్రస్తుతం ఆ శాఖను కేవలం దరఖాస్తులు తీసుకోవడానికే పరిమితం చేశారు. రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే ఎంపిక జరిగిపోతోంది.

కూటమి నేతల కన్ను

పశుపోషణను బట్టి ఒక్కో నియోజకవర్గంలో 90 నుంచి 182 షెడ్ల వరకు కలిపి జిల్లాకు 854 షెడ్లు మంజూరు లక్ష్యంగా నిర్ణయించారు. అధిక శాతం మండలాల్లో 40 షెడ్లకుపైగా నిర్మాణానికి వీలుండటం, 90 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండటంతో కూటమి నేతల కన్ను మినీ గోకులాలపై పడింది. ఇప్పటి వరకు 1,333 దరఖాస్తులు రాగా లబ్ధిదారుల ఎంపికలో వారు రంగప్రవేశం చేసి తాము చెప్పిన వారికే షెడ్లు మంజూరు చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని మండలాల్లో కూటమి ప్రభుత్వంలోని ఏ రాజకీయ పార్టీకి ఎన్ని షెడ్లు ఇవ్వాలనే విషయమై పంపకాలు చేసుకుంటున్నారు. పంపకాల్లో విభేదాలు తలెత్తి కొన్నిచోట్ల పార్టీ పెద్దల వద్దకు పంచాయతీలు చేరుతున్నాయి. ఒక మండలంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకుల మధ్య పంపకాలు తేలక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పంచాయతీ చేరినట్టు తెలిసింది. ఒక నియోజకవర్గంలో నాయకుల మధ్య సఖ్యత కుదరకపోవడంతో మంజూరు వివరాలను పెండింగ్‌లో పెట్టినట్టు సమాచారం.

ఎమ్మెల్యే కార్యాలయం జాబితాకు ఆమోదం

కొన్నిచోట్ల కూటమి నేతల సఖ్యత కుదరక లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. లబ్ధిదారులు ఎంపికకు ముందుగా గ్రామసభలో ఆమోదం పొందాల్సినప్పటికీ రాజకీయ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎంపిక ప్రక్రియ కానిచ్చేస్తున్నారు. తమకు కావాల్సిన వారికి కట్టబెట్టుకుంటున్నారు. అధికారులు కూడా అర్హతతో నిమిత్తం లేకుండా ఎమ్మెల్యేల కార్యాలయాల నుంచి వచ్చిన జాబితాలకే టిక్కులు పెడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంతవరకు జిల్లాలో రూ.10.71 కోట్ల విలువైన 630 షెడ్లు మంజూరు చేసినట్టు సమాచారం. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన రైతులకు మినీగోకులాలు కేటాయించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.

ప్రభుత్వ సాయం ఇలా

పాడి పశువులు	షెడ్డు వ్యయం	కేంద్రం సాయం	రైతు వాటా
రెండు	రూ. 1,15,000	రూ.1,03,500	రూ. 11,500
నాలుగు	రూ. 1,85,000	రూ. 1,66,500	రూ. 18,500
ఆరు	రూ. 2,30,000	రూ. 2,07,000	రూ. 23,000

నియోజకవర్గాల వారీగా మినీ గోకులాల వివరాలు

నియోజకవర్గం	లక్ష్యం	దరఖాస్తులు	మంజూరైనవి	మొత్తం రూ.కోట్లలో
ఆచంట	138	149	121	2.41
భీమవరం	92	277	88	1.76
నరసాపురం	100	254	88	1.61
పాలకొల్లు	142	146	0	0
తాడేపల్లిగూడెం	60	189	88	1.93
తణుకు	138	143	95	92.07 లక్షలు
ఉండి	184	175	150	2.08

న్యూస్‌రీల్

టమోటా సెంచరీ మోత



నూజివీడు: టమోటా ధర పేద, మధ్యతరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. కిలో ధర నూజివీడులోని బహిరంగ మార్కెట్‌లో సోమవారం రూ.100 పలికింది. మన రోజువారీ కూరల్లో టమోట తప్పనిసరి. అలాంటి పరిస్థితుల్లో టమోటా ధర చూసి బెంబేలెత్తుతున్నారు. కూరల్లో టమోట వాడకాన్ని గృహిణులు తగ్గించేస్తున్నారు. టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు టమోటా చట్నీని మెనూ నుంచి తీసేశారు. రైతు బజారులో కిలో రూ.80 రేటు పెట్టినప్పటికీ ఆ రేటుకు రావడం లేదు. రైతుబజారు కంటే కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారు. గతంలో 10 బాక్సులు అమ్మే దుకాణదారులు నేడు ఒక బాక్సు మాత్రమే అమ్ముతున్నారు. జిల్లాకు టమోటా చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి దిగుమతి అవుతుంది. అక్కడ పంట తగ్గడంతో ధర పెరిగిందని, అక్కడి నుంచి ఇక్కడకు రావడానికి ట్రాన్స్‌పోర్టు ఖర్చులు కూడా విపరీతంగా పెరిగాయని, దీంతోనే టమోట ధరలకు రెక్కలొచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇతర కూరగాయల ధరలు కూడా కిలో రూ.50కు చేరాయి.

టెట్ పరీక్షకు 91 శాతం హాజరు

భీమవరం: జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) పరీక్షకు 91 శాతం అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి చెప్పారు. డీఎన్నార్ అటానమస్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 210 మందికి 191 మంది హాజరయ్యారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

ఏలూరు జిల్లాలో

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్–2024 పరీక్షలు నగరంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. తొలి విడత పరీక్షకు 186 మందికి 168 మంది హాజరుకాగా 18 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ప్రారంభమైన రెండో విడత పరీక్షకు 186 మందికి 164 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరయ్యారు.

ఏలూరుపాడులో 144 సెక్షన్ పొడిగింపు

కాళ్ల: కాళ్ల మండలం ఏలూరుపాడులో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా మరో 15 రోజులపాటు 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు కాళ్ళ ఎస్సై శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు ఆకివీడు సీఐ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 23 వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రధానంగా ఏలూరుపాడు, కాళ్ళ, పెదఅమీరం గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు సైతం ఈ సెక్షన్ వర్తిస్తుందన్నారు. ఐదుగురు కంటే ఎక్కువ వ్యక్తులు గుంపుగా ఉండరాదని స్పష్టం చేశారు. సభలు సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు



వేండ్ర పాడిదార్ రోడ్డులో మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

పాలకోడేరు : 'పైపులైన్ల లీకేజీని అరికట్టాలి' అనే శీర్షికతో సోమవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. వేండ్ర గ్రామంలోని పాడిదార్ వీధిలో పంచాయతీ పైపులు లీకేజీతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారనే వార్తకు పంచాయతీ కార్యదర్శి గునుపూడి కృష్ణ మోహన్, సిబ్బంది స్పందించారు. అప్పటికప్పుడు కూలీల్ని ఏర్పాటు చేసి పైపులైను లీకేజీకి మరమ్మతులు నిర్వహించారు.

ధరల అదుపునకు చర్యలు తీసుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): టమోటాలు, బంగాళదుంపలు, ఉల్లిపాయలు సరసమైన ధరలకు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సివిల్ సప్లయిస్, మార్కెటింగ్, హోల్ సేల్ కూరగాయల వర్తకులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బంగాళదుంపలు, ఉల్లిపాయలు బల్క్‌గా కొని నియోజకవర్గాల వారీగా మార్కెటింగ్ శాఖ ద్వారా అమ్మేందుకు చర్యలు చేపట్టాలన్నారు. టమోటాను హోల్ సేల్ ధరకే అమ్మాలన్నారు.




సిరులు కురిపించే తల్లీ..

తనను నమ్మిన వారింట సిరులు కురిపించే ధనలక్ష్మిగా తాడేపల్లిగూడెం బలుసులమ్మ వారు సోమవారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా బలుసులమ్మను, ఆలయ ప్రాంగణాన్ని రూ.30 లక్షల విలువైన నోట్లతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

– తాడేపల్లిగూడెం(టీఓసీ)

దుర్గాదేవికి స్వర్ణకిరీటం బహూకరణ



నిడమర్రు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మందలపర్రు శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో భక్తులు రూ.42 లక్షల విలువైన 500 గ్రాముల స్వర్ణ కిరీటాన్ని సోమవారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సుబ్బరాజు, శేకరం, కృష్ణంరాజు, రామచంద్రరాజు మాట్లాడుతూ అమ్మవారి కిరీటానికి గ్రామంలోని భక్తులతో పాటు ఇతర గ్రామాల భక్తులు 2 నుంచి 10 గ్రాముల చొప్పున స్వచ్ఛందంగా బంగారం అందించారన్నారు. దీంతో అమ్మవారికి ఈ స్వర్ణ కిరీటాన్ని సమకూర్చినట్లు తెలిపారు. ఈ కిరీటాన్ని మంగళవారం ఉదయం క్షేత్రంలోని దుర్గామాతకు అలంకరిస్తామన్నారు. ముందుగా మందలపర్రు గ్రామ దేవత జమ్ములమ్మ ఆలయం వద్ద అమ్మవారికి చలివిడి పానకాలు సమర్పించిన అనంతరం క్షేత్రంలోని అమ్మవారికి ఈ కిరీటాన్ని అలంకరిస్తామన్నారు. ఈ సందర్భంగా భక్తులే స్వయంగా తయారు చేసిన 1.5 టన్నుల బరువున్న 11 రకాల స్వీట్లతో అమ్మవారికి సారె సమర్పించనున్నట్లు తెలిపారు.

మహాచండిగా దర్శన భాగ్యం



మహాచండిగా ఆకివీడు పెద్దింటమ్మవారు



జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ ..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో సోమవారం ఐదో రోజు అమ్మవారు మహాచండిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి.. లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆకివీడు పెద్దింటమ్మ, జంగారెడ్డిగూడెం గంగానమ్మ ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

– జంగారెడ్డిగూడెం, ఆకివీడు

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలకు సోమవారం ఏర్పాట్లు చురుగ్గా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పనులు శరవేగంగా జరిగాయి. ఈ నెల 13 నుంచి 20 వరకు జరగనున్న ఉత్సవాలను పురస్కరించుకుని గుడి సెంటర్‌లో 40 అడుగుల స్వామివారి భారీ విద్యుత్ కటౌట్‌ను నిర్మిస్తున్నారు. ఆలయ రాజగోపురాలకు, పరిసరాలకు విద్యుత్ అలంకారాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే దేవస్థానం ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావులు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ, ఆ శాఖ కమిషనర్ ఎం.సత్యనారాయణమూర్తిని వెలగపూడిలోని వారి కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలసి, స్వామివారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా అర్చకులు మంత్రి, కమిషనర్‌కు శ్రీవారి శేష వస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని, ప్రసాదాలను అందజేశారు.



ద్వారకాతిరుమల గుడిసెంటర్‌లో నిర్మిస్తున్న స్వామివారి భారీ విద్యుత్ కటౌట్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ మీ కోసం నిర్వహించారు. కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ సమస్యలను కూలంకషంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి క్షేత్రస్థాయిలో అర్జీదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్జీలు ఎట్టి పరిస్థితుల్లో రీ ఓపెన్ కాకూడదని తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పట్టాదారు పాస్ పుస్తకాల మంజూరు, పంచాయతీ, ఉపాధి పనులు, తదితర అంశాలపై వచ్చిన సమస్యలను ఆయా శాఖల అధికారులకు పంపించి వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ జె.ఉదయభాస్కరరావు, డ్వామా పీడీ కెసీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): బీసీ, ఈబీసీ, సంచార జాతుల కులా విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన పీఎం యశస్వి పథకంలో ఉపకారవేతనాలు పొందేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10వ తరగతి విద్యార్థులు ఈ నెల 15 లోపు, ఇంటర్ విద్యార్థులు ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తులకు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు డీఈఓ ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రింటెడ్ నామినల్ రోల్స్, ఎస్‌బీఐ కలెక్ట్ రసీదు, ప్రధానోపాధ్యాయుల లేఖతో డీఈఓ ఏలూరు కార్యాలయంలో అందజేసేందుకు అక్టోబర్ 17 చివరి తేదీ అన్నారు. ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్‌లో పరిశీలించాలన్నారు.

నిత్య పెళ్లికొడుకు అరెస్టు

- ఇస్రోలో ఉద్యోగం.. 100 ఎకరాలు ఉందంటూ మోసం
- ఇంతవరకూ రూ.1.50 కోట్ల వరకూ మోసగించాడంటున్న పోలీసులు



ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: మ్యాట్రిమోనీ ద్వారా వల వేసి అనేక మందిని మోసం చేస్తూ భారీగా డబ్బులు కాజేసిన నిత్య పెళ్లికొడుకుని భీమడోలు పోలీసులు అరెస్ట్ చేశారు. ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ వివరాలు వెల్లడించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం బంగారుపేటకు చెందిన ఆశం అనిల్‌బాబు అలియాస్ కళ్యాణ్‌రెడ్డి 9వ తరగతి వరకే చదివినా.. ఇస్రోలో హెచ్ఆర్ అని చెప్పుకునేవాడు. భారత్ మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో కల్యాణ్ పేరుతో రిజిస్టర్ చేసుకోగా, పెళ్ళి సంబంధాలు రాకపోవడంతో కళ్యాణ్ రెడ్డిగా మార్చాడు. పెళ్ళి సంబంధాల కోసం ఫోన్ చేసేవారిని తన తండ్రి మాట్లాడుతున్నట్టుగా నమ్మిస్తాడు. తన కొడుకు ఇస్రోలో పనిచేస్తున్నాడని, తాను, తన భార్య ఇస్రోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నామని, తమకు 100 ఎకరాల భూమి, రెండు విల్లాలు ఉన్నాయని నమ్మిస్తుంటాడు. కట్నకానుకలతో పనిలేదని చెబుతూ పెళ్ళి చూపులకు వెళతాడు. పెళ్ళి కూతురు నచ్చిందంటూనే వారి బంధువుల వివరాలు సేకరిస్తాడు. వారికి ఇస్రోలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి భారీ మొత్తంలో నగదు కాజేస్తాడు. జనాలను నమ్మించేందుకు హైదరాబాద్‌లో ఒక ఫాం హౌస్, బెంగళూరులో ఒక విల్లాను అద్దెకు తీసుకుని వాటిని తనవే అని కలరింగ్ ఇస్తాడు. హైదరాబాద్‌లో ఒక పీఏ, వాచ్‌మేన్, ఒక మహిళా అసిస్టెంట్, ఇద్దరు బౌన్సర్లను పెట్టుకుని.. సలహాలు ఇచ్చేందుకు కాశీ అనే వ్యక్తిని, పెళ్ళి చేసేందుకు పంతులును సైతం ఏర్పాటు చేసుకున్నాడు.

పెళ్లి, ఉద్యోగంటూ రూ.9.53 లక్షల మేర మోసం

ఏలూరు జిల్లా గుండుగొలను గ్రామానికి చెందిన మహిళను నమ్మించి ఆమె రెండో కుమార్తెను పెళ్లి చేసుకుంటానని, మూడో కుమార్తెకు ఇస్రోలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి వారి నుంచి ఆన్‌లైన్‌లో రూ.9.53 లక్షలు కాజేశాడు. శశాంక్ అనే వ్యక్తి ద్వారా ఇంటర్వ్యూ చేయించి, ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చాడు. డబ్బులు తీసుకుని ఎంతకీ జాబ్‌లో చేర్పించకపోవటంతో మోసపోయామని తెలుసుకుని వారు భీమడోలు పోలీసులకు 2023లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు నిత్య పెళ్లికొడుకు అనిల్‌బాబును అరెస్ట్ చేశారు. అనిల్‌బాబు ఇంతవరకూ పలువురిని రూ.1.50 కోట్ల వరకూ మోసగించినట్లు తేలింది. ఈ కేసులో అనిల్‌బాబుతో పాటు కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం కాలమలకు చెందిన తుంగ శశాంక, నంద్యాల జిల్లా బనగానిపల్లి మండలం బత్తులూరుపాడుకి చెందిన పల్లె హేమంత్‌రెడ్డిని భీమడోలు సీఐ యూజీ విల్సన్ అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.2 లక్షల నగదు, కారు, 5 సెల్‌ఫోన్లు, 13 సిమ్ కార్డులు, ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్లు తయారు చేసే కంప్యూటర్, రెండు ల్యాప్‌టాప్‌లు, బ్యాంక్ చెక్‌బుక్‌లు 4, ఇతర ముఖ్యమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ విజేత 'పశ్చిమ'



విజేత పశ్చిమ గోదావరి జట్టు సభ్యులు

పెనుమంత్ర: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో పశ్చిమ గోదావరి జట్టు విజేతగా నిలిచింది. మార్టేరు ఎస్‌వీజీ పాఠశాల పీడీ కృష్ణారెడ్డి నేతృత్వంలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో పల్నాడు జట్టుపై పశ్చిమ జట్టు 17–09 తేడాతో విజయం సాధించినట్లు పీడీ పడాల శ్రీనివాసరెడ్డి తెలిపారు. పశ్చిమ జట్టుకు మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మెడల్స్ బహూకరించారు. గెలుపునకు కారణమైన పీడీ బీవీ సత్యనారాయణ(జున్నూరు), ఎస్ వినాయకరెడ్డి(పోడూరు), ప్రసాద్‌రెడ్డి(కంతేరు), దిలీప్ (పెంటపాడు), కె నాగరాజు(పోడూరు) పలువురి ప్రశంసలు అందుకున్నారు.

రెజ్లింగ్ విజేతలకు అభినందనలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తరపున 68వ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని గెలుపొందిన విజేతలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సోమవారం అభినందించారు. ఎన్టీఆర్ జిల్లాలో ఈ నెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ అండర్ 17 బాలుర గ్రీకో రోమన్,, అండర్ 14 బాలురు, బాలికల ఫ్రీస్టైల్ విభాగాల్లో జిల్లా నుంచి 23 మంది పాల్గొనగా వారిలో 11 మంది క్రీడాకారులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన బీ హిమవంశీకృష్ణ, బీ రత్నబాలాజీ, టీ చరణ్, ఎస్.రూతమ్మ, సీహెచ్ పవన్, కే సింధు, టీకే కౌశిక్, టీ హాసిని, ఎం.గోపిక, జీ రేష్మిప్రియ, ఆర్ రోజ్‌లీస్‌లను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా జట్ల ఎంపిక

దెందులూరు: ఏలూరు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, 17 బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 15వ తేదీ నుంచి జరుగుతాయని స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కే.అలివేలు మంగ తెలిపారు. 15వ తేదీన ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో హాకీ, 16న అథ్లెటిక్స్, 18వ తేదిన ఎస్ఎస్ఆర్ జీసీపీజీ గోపన్నపాలెంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, త్రోబాల్ ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఆటో ఢీకొని 'భవానీ' దుర్మరణం

మరో మాలధారునికి తీవ్ర గాయాలు



మృతి చెందిన భవానీ మాలధారుడు ఆదిరెడ్డి


భీమడోలు: కాలినడకన విజయవాడ వెళుతున్న ఇద్దరు భవానీ మాలధారులను ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా మండపేట మండలం మాచవరంనకు చెందిన మల్లిడి ఆదిరెడ్డి(24), వెలగల శివ భవానీమాలదీక్షను ధరించి విజయవాడలోని దుర్గమ్మ దర్శనానికి కాలి నడకన వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యమైన కైకరం వద్దకు వచ్చేసరికి ఓ పాల కేన్ల లోడు ఆటో వారిని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లిడి ఆదిరెడ్డి(24) అక్కడిక్కడే మృతి చెందగా శివకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ తరహాలో అపార్

- ఇది విద్యార్థుల కోసమే
- 12 అంకెలతో కేంద్రం ప్రత్యేక స్టూడెంట్ ఐడీ జారీ
- ఒక్క నంబర్‌లో విద్యార్థి పూర్తి డేటా నిక్షిప్తం
- 9, 10 తరగతి విద్యార్థులకు జారీకి సన్నాహాలు
- ఉమ్మడి పశ్చిమలో 1.12 లక్షల విద్యార్థులకు ప్రయోజనం
- ఈనెల 14వ తేదీ నుంచి యూడైస్ ప్లస్‌లో వివరాల నమోదు



అపార్ వెబ్‌సైట్



అపార్ మాదిరి కార్డ్

9,10 తరగతుల ప్రభుత్వ/ప్రైవేటు విద్యార్థులు		
ఏలూరు జిల్లా	:	54,925
పశ్చిమగోదావరి జిల్లా	:	57,700
ఉమ్మడి జిల్లా మొత్తం	:	1,12,625

నిడమర్రు: దేశవ్యాప్తంగా ప్రజలకు ప్రత్యేక గుర్తింపు కార్డుగా ఉన్న ఆధార్ కార్డ్ తరహాలో పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం 12 సంఖ్యలతో ఉండే అపార్ కార్డ్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. జాతీయ విద్యావిధానం–2020 అమలులో భాగంగా ఈ అపార్ కార్డ్‌ను పాఠశాల, కళాశాల విద్యాశాఖ అధికారులు జారీ చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. దీనికోసం ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు తొలుతగా 9, 10 తరగతులు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు జారీ చేసేందుకు మార్గదర్శకాలు జారీ చేశారు. దీనిలో భాగంగా ఆయా తరగతులు చదువుతున్న ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు ఈ అపార్ గుర్తింపు కార్డ్ ప్రయోజనాలు తెలిసేలా ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు కృషి చేశారు. దసరా సెలవులు ప్రారంభం రోజైన ఈనెల 1వ తేదీన ప్రతి విద్యార్థికి ఈ అపార్ కార్డ్ అందించేందుకు ఆయా తల్లిదండ్రుల నుంచి సమ్మతి పత్రం జిరాక్స్ సెట్ పంపిణీ చేశారు. దసరా సెలవుల అనంతరం తల్లి/తండ్రి సమ్మతి తెలిపేలా ఆ సమ్మతి పత్రంపై సంతకాలు చేయించి ఈ నెల 14వ తేదీన పాఠశాలలకు తీసుకువచ్చేలా ఈమేరకు ఉమ్మడి జిల్లా డీఈవోలు మార్గదర్శకాలు జారీ చేశారు. ఇప్పటికే యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో 9, 10 తరగతుల విద్యార్థుల పేర్లు మాత్రమే అపార్ కార్డ్‌కు అందించేందుకు అవసరమైన వివరాలు పొందుపరిచారు. దసరా సెలవుల అనంతరం ఉమ్మడి జిల్లాలో 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ అపార్ ఐడీ నెంబర్ కేటాయించనున్నారు.

అపార్ ఐడీ అంటే..?

ఏపీఏఏఆర్ (అపార్) ఐడీ పూర్తి రూపం ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ. ఈ కార్డులను జారీ చేయడానికి భారత ప్రభుత్వం అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ బ్యాంక్)ని ప్రారంభించింది. ఈ కార్డ్ ఎడ్యుకేషన్ ఎకోసిస్టమ్ రిజిస్ట్రీగా పని చేస్తుంది. దీనిని ఎడ్యూలాకర్‌గా సూచిస్తారు. దేశం అంతటా పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేక గుర్తింపు నంబర్‌లను రూపొందించడానికి జాతీయ విద్యా విధానం –2020 ప్రకారం విద్యా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఈ అపార్ ఐడీ కార్డ్‌ను అందిస్తున్నారు.

ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ అపార్ ఐడీలు..

ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు గల ప్రభుత్వ/ప్రైవేటు విద్యార్థులందరికీ ఈ అపార్ ఐడీ కార్డు జారీ చేస్తారు. ఈ ఐడీ విద్యార్థి జీవిత కాలం ఐడీగా పరిగణించనున్నారు. ఈ కార్డ్‌లో విద్యార్థి విద్యాసంబంధిత మెమోలు, స్కాలర్‌షిప్స్ సర్టిఫికెట్లు, కుటుంబ వివరాలు పొందుపరుస్తారు. దీంతో దేశంలో ఏ రాష్ట్రంలో చదివినా విద్యార్థికి ఒకే నంబర్ కేటాయిస్తారు. విద్యార్థికి సంబంధించిన వివరాలు ఒకే కార్డుకు అనుసంధానించి ఉండటంతో ప్రభుత్వ ఉద్యోగాలకు, ఏదైనా పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడం సులభతరం కానుంది.

సురక్షితం చేసే బాధ్యత కేంద్రానిదే

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఈ అపార్ కార్డ్‌లో నిక్షిప్తం చేయబడిన మొత్తం సమాచారాన్ని సురక్షితంగా ఉంచుతుంది. అలాగే ఈ కార్డ్ దుర్వినియోగం చేసే అవకాశం లేకుండా పరిరక్షిస్తుంది. ఈ కార్డ్‌లోని మొత్తం సమాచారం విద్యాపరమైన ఉపయోగం కోసం మాత్రమే ఉపయోగిస్తుంది. ఈ కార్డు తీసుకోవడం స్వచ్ఛందమైనది. తప్పనిసరి కాదు.

అపార్ గుర్తింపు కార్డు ప్రయోజనాలు..

- అపార్ కార్డ్ అనేది విద్యార్థులకు జీవితకాల గుర్తింపు సంఖ్య. ఇది వారి విద్యాపరమైన పురోగతి, విజయాలను బహిర్గతం చేసేందుకు వీలుంటుంది
- ఈ కార్డ్ విద్యార్థుల డేటాను డిజటల్‌గా ఒకే చోట అందుబాటులో ఉంచుతుంది. అంటే అభ్యాసన ఫలితాలు, పరీక్ష ఫలితాలు, హెల్త్ కార్డ్, ఒలింపియాడ్‌లో ర్యాంకింగ్, ప్రత్యేక నైపుణ్య శిక్షణ పొందడం, క్రీడల్లో రాణించడం వంటి సహ–పాఠ్యాంశాల ప్రగతి వంటి తెలుసుకోవచ్చు.
- ఇది విద్యార్థి పూర్తి డేటాను కలిగి ఉన్నందున ఇది ఒక పాఠశాల /కళాశాల నుంచి మరోక పాఠశాల / కళాశాలకు విద్యార్థి బదిలీ ప్రక్రియను (టీసీ ఇచ్చేందుకు) సులభతరం చేస్తుంది. దీంతో దేశంలోని ఏ ప్రాంతంలోనైనా కొత్త విద్యాసంస్థలో ప్రవేశం పొందడం చాలా సులభం.
- విద్యార్థులు ఏ తరగతిలోనైనా డ్రాప్ అవుట్ అవుతుంటే తక్షణం ట్రాక్ చేసేందుకు వీలుంటుంది. దీంతో వారిని తిరిగి చదువుకునేలా ఆయా తరగతుల్లో తిరిగి ప్రవేశం కల్పించేందుకు సహాయపడుతోంది.
- ఈ కార్డ్ ఆ విద్యార్థికి ప్రభుత్వ పరంగా అందుతున్న సంక్షేమ పథకాలు, ఉపకారవేతనాలు, డిగ్రీలు, రివార్డులు, ఇతర విద్యార్థుల క్రెడిట్‌లతో సహా అకడమిక్ డేటా డిజిటల్ రూపంలో ఉంటుంది.
- ఈ అపార్ కార్డ్ ఐడీ నేరుగా ఏబీసీ బ్యాంక్‌తో లింక్ చేయబడుతోంది. దీంతో ఒక విద్యార్థి సెమిస్టర్ లేదా కోర్సును పూర్తి చేసినప్పుడు, క్రెడిట్‌లు నేరుగా ఏబీసీలో ప్రతిబింబిస్తాయి. ఇది భారతదేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో చెల్లుబాటు అవుతోంది.
- ఈ గుర్తింపు కార్డు ద్వారా విద్యార్థులకు ఇచ్చిన క్రెడిట్ స్కోర్ వారి ఉన్నత విద్యా / విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే ప్రవేశ పరీక్షలకు పరిగణలోకి తీసుకుంటారు.
- ఈ అపార్ గుర్తింపు కార్డ్ ద్వారా డిజీలాకర్ ఖాతాను లింక్ చేస్తూ వివరాలు పొందుపర్చుతారు.

అపార్ ఐడీ ఇలా పొందాలి

ప్రభుత్వ/ ప్రైవేటు పాఠశాలల, జూనియర్ కళాశాల విద్యార్థుల వివరాలు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఈ వెబ్‌సైట్‌లో నిక్షిప్తమైన సమాచారాన్ని పరిగణలోకి తీసుకుని వారి ఆధార్ ఐడీ లేదా ఇతర అధికారికంగా గుర్తించబడిన పత్రాల ద్వారా ప్రామాణికరించి ప్రత్యేక గుర్తింపు అపార్ సంఖ్యను రూపొందించబడుతోంది. దీంతో పాఠశాలల స్థాయిలో విద్యార్థులకు అపార్ ఐడీ పాఠశాలల్లోనే జారీ చేస్తారు. ఈ అపార్ ఐడీ నమోదు కోసం మైనర్ విద్యార్థులైతే తల్లిదండ్రులు పాఠశాలలకు సమ్మతి పత్రం అందించాలి. సమ్మతి పత్రం పొందిన తర్వాత అపార్ కార్డ్ జారీ కోసం పాఠశాల విద్యార్థులను నమోదు చేస్తారు. మేజర్ విద్యార్థులు ఏబీసీ బ్యాంక్ వెబ్‌సైట్ ద్వారా వివరాలు అందించి ఈ అపార్ కార్డ్ పొందవచ్చు.

అపార్ ఐడీకి తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి



ఈ అపార్ ఐడీ పొందాలంటే తల్లిదండ్రుల అనుమతి పత్రం తప్పనిసరి. దసరా సెలవుల అనంతరం ఈనెల14వ తేదీ నుంచి ఆయా స్కూల్స్‌కు సంబంధించిన యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ట్యాగ్ చేయబడిన అపార్ కాలమ్‌లో 9, 10 తరగతి విద్యార్థుల వివరాలు నమోదు చేసేలా ఇప్పటికే ఆయా ప్రభుత్వ/ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలకు సూచనలు జారీ చేసాం.

–ఎస్. అబ్రహం, డీఈవో, ఏలూరు

నకిలీ సర్టిఫికెట్లకు అవకాశం ఉండదు



కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు జారీ చేస్తున్న ఈ అపార్ గుర్తింపు కార్డుతో నకిలీ స్టడీ/ మార్కుల ధ్రువీకరణ పత్రాలు, డిగ్రీ, పీజీ వంటి సర్టిఫికెట్లకు అవకాశం ఉండదు. ప్రతి విద్యార్థికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించడం వల్ల, విద్యార్థులకు భవిష్యత్ విద్యా అవసరాలకు, ఉద్యోగ అవసరాలకు చాలా ప్రయోజనంగా ఉంటుంది.

–సబ్బిత నరసింహమూర్తి, ట్రెజరర్, స్టేట్ ఎంఈవో అసోసియేషన్

తణుకులో కోతాట

- స్పార్క్ హోటల్‌లో భాగోతం
- పోలీసుల అదుపులో 41 మంది జూదరులు



హోటల్‌లో కోతాట ఆడుతూ పట్టుబడిన జూదరులు

తణుకు: తణుకు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని స్పార్క్ హోటల్‌లో కోతాట స్థావరంపై పోలీసులు సోమవారం రాత్రి మెరుపుదాడి చేశారు. హోటల్‌లోని అయిదో అంతస్తులోని సూట్ రూములో కోతాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో తణుకు పట్టణ, రూరల్ సీఐలు కె.కొండయ్య, బి.కృష్ణకుమార్, ఎస్సైలు కె.శ్రీనివాస్, జీఎస్‌వీ మూర్తి ఆధ్వర్యంలో దాడి చేశారు. ఘటనా స్థలంలో కోతాట ఆడుతున్న 41 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 1,17,020 నగదు, 41 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే స్పార్క్ హోటల్ ఉండగా తణుకు టీడీపీ నేత, మాజీ కౌన్సిలర్ సప్పా వీరరాఘవులు అలియాస్ రాజు ఈ హోటల్ నిర్వహిస్తున్నారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్‌గా కొనసాగుతున్న వ్యక్తి ఆధ్వర్యంలో గత కొంతకాలంగా భారీ ఎత్తున కోతాట, పేకాట జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిందితులపై కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

145 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

తాడేపల్లిగూడెం: విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు సోమవారం సాయంత్రం పెదతాడేపల్లిలో చేసిన దాడుల్లో ఒక గోదాములో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పెద్ద ఎత్తున గోదాములో బియ్యం నిల్వ చేసినట్టు విజిలెన్స్ ఎస్పీ వి.శ్రీరాంబాబుకు వచ్చిన సమాచారంతో విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి 145 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.ఐదు లక్షల 80 వేలుగా నిర్ధారించారు. బియ్యం అక్రమంగా నిల్వ చేసిన వి.కౌశిక్‌మణి, కె.అంజిబాబు, డి.రామకృష్ణలపై కేసు నమోదు చేశారు. దాడుల్లో తహసీల్దార్ కార్యాలయ ఎన్నికల సూపరింటెండెంటు సీ.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న నర్సింహమూర్తి

భీమవరం: ప్రభుత్వ విధానాల కారణంగా సంక్షోభంలో ఉన్న కల్లుగీత కుటుంబాలను ఆదుకునే విధంగా సమగ్ర నూతన కల్లు పాలసీని తక్షణం ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. భీమవరంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీ ప్రభుత్వ ఆదాయం కోసమా లేక ప్రజాప్రతినిధుల ప్రయోజనాల కోసమా అనేది ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ బెల్ట్ షాపుల ద్వారా రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం అమ్మించి కల్లు అమ్మకాలను దెబ్బ తీయొద్దని జుత్తిగ విజ్ఞప్తి చేశారు. రసాయనాలతో తయారైన బీరు, బ్రాందీ, విస్కీ, చీప్ లిక్కర్లను ప్రోత్సహిస్తూ ప్రకృతి సహజసిద్ధమైన ఆహారంలా ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా ఉపయోగపడే తాటికల్లును ప్రభుత్వం శీతల పానీయంగా ఎందుకు ప్రోత్సహించడం లేదని ప్రశ్నించారు. కేరళ ప్రభుత్వం మాదిరిగా కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. గీత కార్మికుల భాగస్వామ్యంతో ఉన్న ఆర్థిక కార్పొరేషన్ తక్షణం పునరుద్ధరించాలని, తాటి చెట్టుకు రూ.10 చొప్పున పన్ను కట్టించుకొని చెట్టుపై గీతకార్మికులకు హక్కు కల్పించాలని, వృత్తిలో ప్రమాదాల నివారించేందుకు సేఫ్టీ మోకులు ఇవ్వాలని నర్సింహమూర్తి డిమాండ్ చేశారు.

కాల్‌మనీ గ్యాంగ్‌లో ఇద్దరు నిందితుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ప్రజలను అధిక వడ్డీలతో జలగల్లా పీడిస్తూ ... లైంగిక వేధింపులకు గురిచేస్తున్న కాల్‌మనీ నిందితుల్లో ఇద్దరు వ్యక్తులను ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. కాల్‌మనీ వ్యవహారంలో ప్రధాన నిందితుడు మేడపాటి సుధాకర్‌రెడ్డి వద్దకి అప్పులు తీసుకున్న వ్యక్తుల నుంచి భారీ ఎత్తున డబ్బులు వసూలు చేస్తూ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. అతడు గూడవల్లి విద్యాసాగర్, మహ్మద్ అఖిల్ రెహమాన్, రాజేష్, లావణ్య అనే వ్యక్తులతో బాధితులపై దౌర్జన్యాలకు సైతం పాల్పడుతున్నాడు. దీనిపై ఏలూరు వన్‌టౌన్, ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌తో సహా పలు స్టేషన్లలో 52 మందికి పైగా బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. కాల్‌మనీ గ్యాంగ్‌పై నమోదైన కేసులపై ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ప్రత్యేక పర్యవేక్షణతో ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. సోమవారం ఏలూరు కెనాల్‌రోడ్డులోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఏలూరు సత్రంపాడు ఎంఆర్‌సీ కాలనీ, చలసాని రెసిడెన్స్‌కు చెందిన నిందితులు గూడవల్లి విద్యాసాగర్, ఏలూరు శనివారపుపేట జెండాచెట్టు ప్రాంతానికి చెందిన మహ్మద్ అఖిల్ రెహమాన్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసును ఛేదించటంలో ప్రతిభ చూపిన ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్సై ఎస్‌కే మదీనాబాషా, కానిస్టేబుళ్లు ఆర్.మోహన్‌కృష్ణ, బీ.నాగార్జున, సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎస్‌బీ సీఐ బీ.ఆదిప్రసాద్, సిబ్బందిని ఏలూరు జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ ఉన్నారు.

భీమవరంలో భారీ వర్షం



జలమయంగా ఫైర్‌స్టేషన్ రోడ్డు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరంలో సోమవారం భారీ వర్షం కురిసింది. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నీటమునిగిన రోడ్లలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అలాగే కొన్ని గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో పుట్‌పాత్ వ్యాపారాలు నిలిచిపోయాయి. ఆదివారం వరకు ఎండలు తీవ్రంగా ఉండడంతో జనం ఉక్కపోతలతో ఇబ్బందులు పడ్డారు. సోమవారం వాతావరణం చల్లబడి వర్షం పడడంతో పట్టణవాసులు ఎండ నుంచి ఉపశమనం పొందారు.

ఆశలను అవకాశాలుగా మార్చుకోండి

నిట్ టెడ్ ఎక్స్‌లో వక్తలు



నిట్ టెడ్ ఎక్స్‌లో వక్తలతో విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఆశలను అవకాశాలుగా మలుచుకొనే సాధనమే ఆధునిక టెక్నాలజీ అని ఐబీఎం కన్సల్టెన్సీ లీడర్ సందీప్ ఛటర్జీ అన్నారు. ఏపీ నిట్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ఆల్కమి ఆర్డినరీ టు ఎక్స్‌ట్రార్డినరీ అనే అంశంపై టెక్నాలజీ ఎంటర్‌ట్రైన్‌మెంటు డిజైన్ టెడ్ ఎక్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చటర్జీ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తూ సరికొత్తగా జీవించాలన్నారు. సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ ఇన్నోవేషన్ ప్రాముఖ్యతను, స్థిరమైన భవిష్యత్తును ప్రోత్సహించడంలో దాని పాత్రను విద్యార్థులకు వివరించారు. పారిశ్రామిక వేత్త మెహెర్‌సాయి మాట్లాడుతూ దేశాభివృద్ధి రథాన్ని పరుగులు తీయించాల్సిన బాధ్యత యువతరానిదే అన్నారు. విద్యార్థులు సొంతంగా కంపెనీలు ఏర్పాటుచేసి పది మందికి జీవనోపాధి కల్పించేస్థాయికి ఎదగాలన్నారు. ఆలోమేటిక్ పరిశ్రమ వ్యవస్థాపకత, వాటిలో ఎదురయ్యే సవాళ్లు, విజయాల గురించి వివరించారు. ప్రముఖ బ్రెయిన్ కోచ్ జయసింహ జ్ఞాపకశక్తిని పెంపొందించుకొనే వివిధ పద్ధతుల గురించి వివరించారు. మాజీ ఐఏఎస్ అధికారి వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ విద్యార్థులు నిత్యాన్వేషగా ఉండాలన్నారు. నచ్చిన కోర్సులను ఇష్టపడి చదవాలన్నారు. సినీ నేపథ్య గాయని (పుష్ప ఫేం)ఇంద్రావతి చౌహాన్ మాట్లాడుతూ ది పుష్పరైజ్ సినిమాలో పాటతో తన జీవితం మారిపోయిందన్నారు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా ఎలక్ట్రికల్ ఇంజనీర్ విభాగం ఆచార్యులు పెద్దపాటి శంకర్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి పర్యవేక్షణలో సాగిన ఈ కార్యక్రమంలో ఆచార్యులు తలారి రేష్మ, కార్తికేయశర్మ, రాజేశ్వర్‌రెడ్డి, వి.సందీప్, ప్రత్యూష, హిమబిందు, అమృత తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి ధరహాసం

- పెరుగుతున్న ఎగుమతులు
- ఉమ్మడి జిల్లాలో 50 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు
- వెయ్యి కాయలు రూ.13 వేలు పైమాటే
- ఇతర రాష్ట్రాల్లో దిగుబడి తగ్గడమే ధరల పెరుగుదలకు కారణమంటున్న వ్యాపారులు



ఎగుమతి చేయడానికి ఒలుపు వలుస్తున్న కొబ్బరి కాయలు

భీమవరం: కొబ్బరిధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వరి సాగు తరువాత రైతులకు ఆదాయనిచ్చే పంట కొబ్బరే. దీంతో అత్యధికంగా రైతులు కొబ్బరి తోటలను నేరుగా పెంచడంతోపాటు పొలంగట్లు, ఖాళీప్రదేశాలు, రోడ్ల వెంబడి, పెరటిదొడ్లలోను కొబ్బరి పెంచుతారు. అయితే ఇటీవల కొబ్బరిచెట్లకు తెగుళ్లు ఆశించడంతో దిగుబడి తగ్గిపోవడమే గాక ధరకూడా అంతంత మాత్రంగా ఉండడంతో రైతులు అనేకచోట్ల కొబ్బరితోటను తొలగిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల్లో కొబ్బరి సాగుచేస్తుండగా దీనిపై ఆధారపడి సుమారు 35 వేలమందికి పైగా రైతులున్నారు. ఒకప్పుడు కోస్తా ప్రాంతంలో కొబ్బరి మంచి ఆదాయం ఇవ్వడంతో «కన్నకొడుకు కంటే కొబ్బరిచెట్టు మిన్న» అనే నానుడి వాడుకలో ఉండేది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను కొడుకులు పట్టించుకోకపోయిన నాలుగు కొబ్బరిచెట్లు ఉంటే వాటిపై వచ్చే ఆదాయంతో నిశ్చింతగా జీవించవచ్చు అనే నమ్మకంతో ఉండేవారు. అయితే కొన్నేళ్లుగా కొబ్బరికి ఆకునల్లి తెగులు ఆశించి ఆకులు ఎండిపోవడంతో కొబ్బరి దిగుబడి బాగా తగ్గిపోయింది. ఇదే తరుణంలో కొబ్బరి దింపు, ఒలుపు ఖర్చులు పెరిగిపోవడంతో ధరలు కూడా అంతంత మాత్రంగా ఉండడంతో కొబ్బరి పెంపకం పట్ల ఆసక్తి సన్నగిల్లింది.

ఆశాజనకంగా నేటి ధరలు

జిల్లాలో కొబ్బరి ఎగుమతులకు పాలకొల్లు పేరుగాంచింది. అక్కడి నుంచి తమిళనాడు, కేరళ, కర్నాటక, మధ్యప్రదేశ్, మహరాష్ట్ర, రాజస్థాన్, చత్తీస్‌గడ్ వంటి రాష్ట్రాలకు ప్రతి రోజు 100 లారీల వరకు కొబ్బరికాయలు ఎగుమతి అయ్యేవి. అయితే గత రెండేళ్లుగా కేరళ, తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడి గణనీయంగా పెరగడంతో మన కొబ్బరిపై తీవ్రప్రభావం చూపింది. అక్కడి కాయలు సైజు పెద్దవి కావడం, నీరు ఎక్కువగా ఉండడంతో మన జిల్లాలోని కొబ్బరికి ప్రాధాన్యత తగ్గింది. దీనితో కొబ్బరి ధరలు తగ్గడంతోపాటు దిగుబడి కూడా తగ్గడంతో రైతుల్లో కొబ్బరి పెంపకంపై ఆసక్తి తగ్గింది. ఇటువంటి తరుణంలో ఒక్కసారిగా కొబ్బరి ధరలు పెరగడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మొన్నటి వరకు వెయ్యికాయలు రూ.10 వేలు లోపు ధర పలకగా ప్రస్తుతం రూ.13 వేలకు పైబడి కొనుగోలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు తగ్గడంతోపాటు వరుసగా పండుగలు రావడంతో ధరలు పెరుగుతున్నాయని కొబ్బరి వ్యాపారులు చెబుతున్నారు. సంక్రాంతి వెళ్లే వరకు ధరలు నిలకడగా ఉంటాయని భావిస్తున్నారు. దీనితో గ్రామాల్లో కొబ్బరి దింపులు పెరిగి జోరుగా ఎగుమతులవుతున్నాయని, దీనితో కొబ్బరి దింపు, ఒలుపు కార్మికులకు చేతినిండా పనిదొరుకుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్ట్

- రూ.3.50 లక్షల విలువైన బంగారం, వెండి, మోటార్‌సైకిళ్ల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ యు.రవిచంద్ర



జంగారెడ్డిగూడెంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిచంద్ర, ఎస్సై షేక్ జబీర్

జంగారెడ్డిగూడెం: వివిధ చోరీ కేసుల్లో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆదివారం రాత్రి స్థానిక బుట్టాయగూడెం రోడ్డులో నూకాలమ్మ గుడి వద్ద ఉన్న నిందితులు కోన శ్రీనివాసరావు అలియాస్ పెప్సీ నాని, విత్తనాలు గణేష్, విత్తనాల దుర్గా సాంబ శివలను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఆగస్టు 5వ తేదీ రాత్రి జంగారెడ్డిగూడెం పట్టణ శివారు ఫైర్‌స్టేషన్ వద్ద ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను కొట్టి గాయపరిచి, డ్రైవర్ సెల్‌ఫోన్ చోరీతో పాటు, పట్టణంలోని కొడాలి వారి వీధిలో ఓ ఇంట్లో, కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం గ్రామం వైఎస్సార్ కాలనీలోని ఇంట్లో, ద్వారకాతిరుమలలోని ఓ ప్రైవేట్‌ఆసుపత్రి వెనుక ఉన్న ఇంట్లో చోరీలు, జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్, పద్మ థియేటర్ సమీపంలో, జాబిల్లి ఆసుపత్రి వద్ద, భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో , ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు వద్ద మోటార్‌సైకిల్ చోరీలకు సంబంధించి వీరు నిందితులుగా ఉన్నట్లు విచారణలో తేలిందన్నారు. వీరి నుంచి రూ.1.14 లక్షలు విలువైన 17.6 గ్రాముల బంగారం, రూ. 11 వేలు విలువైన 123 గ్రాముల వెండి, ఒక సెల్‌ఫోన్, రూ.25 వేలు విలువైన టీవీ, రూ.2 లక్షల విలువైన 5 మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం విలువ రూ.3.50 లక్షలు అని తెలిపారు. కాగా ఈ ముగ్గురు వివిధ కేసుల్లోని పాత నేరస్తులే అని చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో సహకరించిన ఎస్సై ఎస్‌కే జబీర్, ఏఎస్సైలు ఎన్‌వీ సంపత్ కుమార్, ఎన్.రాజేంద్రప్రసాద్, పీసీలు కె.సత్యనారాయణ, రాజశేఖర్‌లను డీఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

తణుకు ఎంపీడీవోగా లోహిత్ జయకుమార్



లోహిత్ జయకుమార్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఉద్యోగులు

తణుకు టౌన్: తణుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీవో) ఆర్ లోహిత్ జయకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సోమవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఎంపీడీవోగా విధులలో చేరారు. ఇప్పటి వరకూ అల్లూరి సీతారామరాజు జిల్లా జీ మాడుగుల ఎంపీడీవోగా పని చేస్తూ బదిలీపై తణుకు ఎంపీడీవోగా వచ్చారు. ఇప్పటి వరకూ తణుకు ఎంపీడీవోగా పని చేసిన కె కిరణ్‌కుమార్ బుట్టయిగూడెం ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. నూతన ఎంపీడీఓగా విధుల్లో చేరిన లోహిత్ జయకుమార్‌కు ఈవోపీఆర్‌డీ రామ్ ప్రసాద్, ఏవో వీ కృష్ణ చంద్రరావు, ఇతర కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు, రేపు ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు శిక్షణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప సర్పంచ్‌లు, ఇరువురు వార్డు మెంబర్లకు మంగళ, బుధవారాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో 2024–25 ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణపై ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఉప సర్పంచ్, స్త్రీ, పురుష వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీల్లో సాధారణ కనీస పరిపాలన విధానం (ఏపీపీఆర్ చట్టం -1994)లోని పది అంశాలపై శిక్షణనిస్తారన్నారు. ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

లైసెన్సు లేకుండా బాణసంచా తయారీపై కేసు నమోదు

అత్తిలి: లైసెన్సు లేకుండా బాణ సంచా తయారు చేస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి ప్రేమ్‌రాజ్ తెలిపారు. సోమవారం అత్తిలి మండలం ఆరవల్లి పరిధిలో కంచుమర్రురోడ్డు లైసెన్సు లేకుండా నిర్వహిస్తున్న బాణ సంచా తయారీ కేంద్రంపై తమసిబ్బందితో దాడిచేయగా విక్రయించడానికి నిల్వ ఉంచిన రూ.1300విలువ గల 65 తారాజువ్వలను సీజ్ చేసామని తెలిపారు. బాణ సంచా తయారీ కేంద్రం నిర్వాహకురాలు ఎస్ సత్యవతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రజల సహకారంలో ఆస్పత్రుల అభివృద్ధి

పెంటపాడు: ప్రజలంతా సహకరిస్తే ఆస్పత్రులను సుందరంగా తీర్చిదిద్దవచ్చని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పెంటపాడు పీహెచ్‌సీ వద్ద పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీల అభివృద్ధి సలహామండలి సమావేశం ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యసిబ్బంది వైద్యం అందజేయాలన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులలో ఉన్నా సరే వైద్యానికి పెద్దపీట తప్పక వేస్తుందన్నారు. ఎంపీపీ దాసరి హైమావతి మాట్లాడుతూ రోగులు, వారి బంధువులు వైద్యుల పట్ల దురుసుగా ప్రవర్తించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తోట రాజేష్, డాక్టర్ వి. పూజిత కూటమి నాయకులు, పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

తణుకులో సీతారాం ఏచూరి సంస్మరణ సభ

తణుకు: సీతారాం ఏచూరి మరణం దేశంలో ఉన్న వామపక్షాలు, లౌకికశక్తులకు, కోట్లాది మంది ప్రజలకు దిగ్భ్రాంతి కలిగించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. సోమవారం స్థానిక మెడికల్ అసోసియేషన్ హాల్‌లో కమ్యూనిస్టు ఉద్యమ రథసారధి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ప్రతాప్ అధ్యక్షతన జరిగింది. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీవీవీఎస్ వర్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, జనసేన పట్టణ అధ్యక్షులు కొమ్మిరెడ్డి శ్రీనివాస్, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు సంకు మనోరమ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మంగెన సూర్య, కాంగ్రెస్‌పార్టీ పట్టణ కార్యర్శి డి.రామకృష్ణ, తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, మునిస్వామి పాల్గొన్నారు.

శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

తణుకు టౌన్: శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఎం వేల్పూరు గ్రామ కమిటీ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని హిందూ, క్రైస్తవ శ్మశాన వాటిలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సోమవారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో వినతి పత్రం అందజేశారు.

గుంతలిలా.. వెళ్లేదెలా?





ప్రత్తిపాడు- అలంపురం గ్రామాల మధ్య గుంతలు పడి వర్షం నీరు నిలిచి ఇబ్బందిగా మారిన రహదారి దృశ్యాలు

- అధ్వానంగా ప్రత్తిపాడు-అల్లంపురం రోడ్డు
- కనీస మరమ్మతులు చేపట్టని పాలకులు

పెంటపాడు: అభివృద్ధి లేదు..రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ ఊక దంపుడు ప్రసంగాలు సోషల్ మీడియాతో తప్పుడు ప్రసంగాలు సాగించిన కూటమి పార్టీల నేతలు ఇప్పుడు అధికారంలోకి వచ్చినా వారికి రోడ్లు, గుంతలు కనిపించడం లేదు. రోడ్ల నిర్మాణం కంటే గుంతలు పూడ్చే స్తామని ప్రకటించిన కూటమి నేతలు ఇప్పుడేమో చేతల్లో కాదు.మాటలకే పరిమితమైనట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం ప్రజల ఇబ్బందులనూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు అధికారం కోసం అరచేతిలో వైకుంఠం చూపించిన కూటమి నేతలు ఇప్పుడు డబ్బుల్లేవు, గల్లపెట్టె ఖాళీ అంటూ పల్లవి అందుకుంటున్నారు.

భారీ వర్షాలకు..

ప్రత్తిపాడు నుంచి అలంపురం వెళ్లే రహదారి గత మూడు నెలలుపైగా స్తంభించింది. ఈ రోడ్డులో ఎంతో కాలం నుంచి రాకపోకలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్తిపాడుతో పాటు కృష్ణాయపాలెం ఆరుగొలను, కొత్తూరు గ్రామాల వాసులు అలంపురం వద్ద జాతీయ రహదారికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఒక నెల క్రితం రహదారి గోతులు పూడ్చారు. మళ్లీ పంచాయతీ కార్యాలయం వద్ద గోతులు పడి ఆటోలు, ద్విచక్రవాహనాలతో పాటు, పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో మరింత ఘోరంగా ఉంటోందని ప్రజలు వాపోతున్నారు. తక్షణం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి



సమావేశంలో నినాదాలు చేస్తున్న దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవిప్రకాష్

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను పూర్తి స్థాయిలో ప్రభుత్వం అరికట్టాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం తాడేపల్లిగూడెం పట్టణం బీవీఆర్ కళాకేంద్రంలో దళిత సేన జిల్లా అధ్యక్షుడు చీలి మోహనరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ దళితులకు రక్షణగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షించాలన్నారు. అట్రాసిటీ చట్టం కింద బాధితుల ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలన్నారు. దళితసేన లీగల్ సెల్ అధ్యక్షుడు తేళ్ల జోసఫ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులపై విచారణవేగవంతం చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు, దళిత సేన మండల ఉపాధ్యక్షుడు కిలాడి రవి, గ్రామ దళిత సేన నాయకులు జాలపర్తి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద కేవీపీఎస్ ధర్నా



ఆర్డీవో బీఎస్.నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: మాధవరం గ్రామంలోని ఎస్టీల శ్మశాన వాటిక సమస్యపై సోమవారం తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.క్రాంతిబాబు మాట్లాడుతూ మాధవరం గ్రామంలోని ఎస్టీల శ్మశాన వాటికను వారికే అప్పగించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో జీవిస్తున్న ఎరుకలకు సర్వే నెంబరు.380లో 1.59 ఎకరాల భూమిలో శ్మశాన వాటిక ఉందని, ఉమ్మడి శ్మశాన వాటిక కావడంతో కొన్ని ఆక్రమణల వల్ల ఉపయోగించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే శ్మశాన వాటికను సర్వే చేయించి ఎరుకలకు భూమిని అప్పగించాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఏపీ ఎస్టీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సింగం సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు మాట్లాడారు. అనంతరం ఆర్డీవో బీఎస్.నారాయణ రెడ్డి, తహసీల్దార్ సునీల్‌కుమార్ వినతి పత్రాలు అందజేశారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు, నాయకులు విజయ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పురిటిగడ్డ జయమ్మ, గ్రామస్తులు చినమర్తి శ్రీను, వయ్యేరు, సీహెచ్. వెంకన్న, చినమర్తి లక్ష్మి, సీహెచ్.సత్యనారాయణ, రాము పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలు చేయండి



ఇరగవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఇరగవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ఉచిత ఇసుక పాలసీ అమలు చేసి కార్మికుల ఉపాధి కల్పించాలని సీపీఎం ఇరగవరం మండల కార్యదర్శి కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇరగవరం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ కూటమి నాయకులు అధికారంలోకి వచ్చేందుకు ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తామని హామీ ఇచ్చారని, అధికారం చేపట్టాక పాలసీ ప్రకటించినా నేటికి క్షేత్ర స్థాయిలో ఇసుక లేక నిర్మాణ రంగ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. తక్షణం ఉచిత ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో కాకుండా పారదర్శకంగా సామాన్యులకు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల సభ్యులు ఎల్లుందపర్తి సత్యనారాయణ, దానాల అప్పారావు, తమరాపు ముసలయ్య, పాలా సత్యనారాయణ, పెచ్చెట్టి నాగేశ్వరరావు, పిల్లి ఏడుకొండలు, పెచ్చెట్టి సుబ్బారావు, పిల్లి కోటేశ్వరరావు, పి సత్యనారాయణ, దంపబోయిన కనికేశ్వరరావు, బొంతు నాగబాబు పాల్గొన్నారు.

డ్రాయింగ్ టీచర్ పోస్టు భర్తీ కాదా?



తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్

- చిత్రలేఖనంపై చిన్నచూపేల
- పార్ట్‌టైం ఉద్యోగితో సరిపెడతారా?

తణుకు అర్బన్: చిత్రాలు చిత్రించడంలో ఆ పాఠశాల విద్యార్థుల నైపుణ్యం అమోఘం.. చిత్రలేఖనంలో ఏ కాంపిటీషన్‌కు వెళ్లినా మొదటి స్థానంలో నిలబడి బహుమతులు కొల్లగొట్టుకురావడం ఆ విద్యార్థులకు వెన్నతోపెట్టిన విద్య. అటువంటి ఆ పాఠశాలకు ఇప్పుడు డ్రాయింగ్ టీచర్ లేని దుస్థితి నెలకొంది. తణుకులో ఎంతో చరిత్ర కలిగిన తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ ప్రస్తుతం 1371మంది విద్యార్థులతో నిత్యం విద్యాబోధన అత్యంత సుందరంగా నిర్వహించబడుతోంది.అయితే గతంలో ఇద్దరు డ్రాయింగ్ టీచర్లు ఉండే ఈ పాఠశాలలో ఒక టీచర్ పోస్టును తొలగించారు. ఇక మిగిలిన ఆ ఒక్క పోస్టుకు సంబంధించిఉన్న ఉపాధ్యాయుడుకూడా ఈ ఏడాది జూలై నెలలో పదవీవిరమణ పొందారు. అప్పటి నుంచి ఆపోస్టు భర్తీ కాకపోవడంతో డ్రాయింగ్‌పై పట్టుఉన్న విద్యార్థులు సైతం నిరాశతో ఉంటున్న పరిస్థితి. అయితే మిగిలిన పాఠశాలల్లో సైతం డ్రాయింగ్ విభాగానికి సంబంధించి ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందిన తర్వాత ఆ పోస్టును భర్తీ చేయడం లేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

డ్రాయింగ్ క్లాస్ తప్పనిసరి

తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులందరికీ తప్పనిసరిగా ప్రతిరోజూ మిగిలిన సబ్జెక్ట్స్ మాదిరిగానే డ్రాయింగ్ క్లాస్ కూడా ఉంటుంది. ఆ హవర్‌లో విద్యార్థులంతా చిత్రలేఖనంపై దృష్టి పెట్టడమే కాకుండా మంచి తర్ఫీదుతో వివిధ కాంపిటీషన్‌లకు వెళ్లే పరిస్థితి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఉపాధ్యాయులు లేకపోవడంతో పార్ట్‌టైం ఉద్యోగితోనే నెట్టుకురావాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. చిత్రలేఖన విద్యకు సంబంధించి పూర్తి స్థాయి బోధనఉంటే విద్యార్థులకు భవిష్యత్ విద్యకు ఆసరాగా ఉంటుందని ఉపాధి అవకాశాలు కూడా మెండుగా ఉంటాయని విద్యార్థులు చెబుతున్నారు.

ఇజ్రాయెల్ యుద్ధాన్ని నిలుపుదల చేయాలి



పెదతాడేపల్లి గ్రామంలో జరిగిన ఇఫ్టూ సమావేశ దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం హమాస్‌దళాలు ఏడాది కాలంగా చేస్తున్న యుద్ధం కారణంగా ఎంతో మంది బాధితులుగా మిగిలారని, ఈ యుద్ధాన్ని నిలుపుదల చేయాలని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఐక్యరాజ్య సమితిపై ఒత్తిడి చేసి యుద్ధ నివారణ చర్యలు తీసుకోవాలని, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్.నాగరాజు, సీహెచ్.వెంకటేశులు, ముసలయ్య, అప్పలకొండ, శ్రీను, సూరిబాబు, మంగరాజు, ప్రభాకర్, పి.రమణ, ఎస్.రాము, బి.వెంకన్న పాల్గొన్నారు.

కరుణించమ్మా.. కనకదుర్గమ్మా



తణుకు టౌన్: బాల త్రిపుర సుందరి దేవీ అవతారంలో తణుకులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



అత్తిలి: ఆరవల్లిలో మహాచండి అమ్మవారి అలంకరణలో అమ్మవారు



తణుకు టౌన్: అన్నపూర్ణదేవీ అలంకరణలో దువ్వ దానేశ్వరి అమ్మవారు

- అన్నపూర్ణదేవిగా అలంకరణలో అమ్మవారు
- పలుచోట్ల కుంకుమ పూజలు




తాడేపల్లిగూడెం రూరల్: శ్రీమహాలక్ష్మి దేవిగా ముత్యాలమ్మ తల్లి



తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం స్కంధ మాతగా దుర్గమ్మ తల్లి



తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీలలిత త్రిపుర సుందరీ దేవిగా సర్వమంగళమ్మ



తాడేపల్లిగూడెం (టీఓసీ) :రాజరాజేశ్వరీగా వాసవి అమ్మవారు

తణుకు టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఐదో రోజు మండలంలోని వివిధ దేవాలయాల్లో సోమవారం అమ్మవారిని శ్రీఅన్నపూర్ణదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో శ్రీ దానేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీ అమ్మవారిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ, సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో శ్రీ యల్లారమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు సందర్భంగా సోమవారం శ్రీ గాయిత్రీ దేవీ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, ఆలయ ఈవో పీ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. తణుకు పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ప్రార్ధనా మందిరంలో ఐదో రోజు శ్రీ బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ముత్యాలమ్మ వారికి మహాలక్ష్మి అలంకరణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారిని దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం శ్రీమహాలక్ష్మి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చండీ పారాయణ, చండీ హోమాలను నిర్వహించారు. అమ్మవారి గర్భాలయాన్ని రూ.5లక్షలు విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. వీరంపాలెంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ అమ్మవారిని స్కంధ మాతగా అలంకరించి పూజలందించారు. పారిశ్రామికవేత్తలు ఉద్దరాజు కిరణ్ వర్మ, చలసాని శ్రీధర్ దంపతులు చండీ హోమం నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించారు.

మహాచండి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవార్లు

అత్తిలి: మండలంలోని శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సోమవారం అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శ్రీమహాచండి అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, సాయంత్రం కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఐదో రోజు వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఐదో రోజు సోమవారం వైభవంగా నిర్వహించారు. వివిధ ఆలయాలు, ఉత్సవ పందిరి లు వద్ద విశేష పూజలు జరిగాయి. వాసవి కన్యక పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగాను, శంకరమఠంలో సర్వమంగళమ్మను శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవిగాను, శ్రీదేవి మహంకాళి అమ్మవారిని రజిత కవచాలంకృత దుర్గాదేవిగాను దేవిగాను, బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో అమ్మవారిని శ్రీ మహాచండీదేవిగాను, వార్ఫ్‌రోడ్డులో ఉత్సవ పందిర వద్ద అమ్మవారిని శ్రీ గజలక్ష్మిదేవిగాను, శ్రీ విశ్వదుర్గేశ్వరీ సమేత అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారిగాను విశేషంగా అలంకరించారు. విశేషంగా భక్తులు అమ్మవారిని దర్శించారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాటుపడాలి



తణుకులో ర్యాలీ పాల్గొన్న న్యాయమూర్తులు, వివిధ విభాగాల అధికారులు

తణుకు అర్బన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, నిర్బంధ బాలల నిర్మూలనకు సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛ త్రిలో భాగంగా సోమవారం న్యాయశాఖ, లేబర్ డిపార్ట్‌మెంట్, పోలీసు శాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, ఎడ్యుకేషన్, ఎజీవోలతో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడారు. ఈ వ్యవస్థను నిర్మూలించే క్రమంలో చట్టాలు సైతం కఠినంగా రూపుదిద్దుకున్నట్లు చెప్పారు. 18 సంవత్సరాల్లోపు బాలబాలికలను కూలి పనులు, వ్యవసాయ, కర్మాగారాల్లోను, హోటల్స్, బట్టల దుకాణాలలోను పనిచేస్తున్నట్లు గుర్తిస్తే ఆ యజమానులకు శిక్షతోపాటు జరిమాన కూడ విధించే విధంగా చట్టం ఉందన్నారు. బాలబాలికలు తప్పనిసరి ఉచిత విద్యకు అర్హులని ప్రతి ఒక్కరూ చదువుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం లేబరు ఆఫీసర్ ఆధ్వర్యంలో వివిధ దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పాతర్లంక సాయిరాం, మొదటి జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీ రంజిత్‌కుమార్, స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్ చిరంజీవిరావు, బార్ అసోసియేషన్ సెక్రటరీ ఈదా రామకృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, ఎన్జీవోలు, అసిస్టెంట్ లేబరు ఆఫీసర్ ఎం.కిరణ్‌కుమార్, పారా లీగల్ వలంటీర్లు, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.